క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మహేశ్వరం: గట్టుపల్లి, కొళ్లపడకల్ గ్రామంలోని 33కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ చక్రపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. కొళ్లపడకల్, పోరండ్ల, దుబ్బచర్ల, సుభాన్‌పూర్, లిల్లీపూర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సరఫరాకు అంతరాయం కలగనుందని వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చెత్తకుప్పలతో.. దుర్గంధం



హస్తినాపురం పద్మావతినగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లలో ప్రధాన రోడ్లతోపాటు కాలనీల్లోని అంతర్గత రోడ్ల వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ఆయా కాలనీల్లో ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను ప్లాస్టిక్ కవర్లలో తీసుకువచ్చి రోడ్డు వెంబడి పడేసి పోతున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు చెత్తకు నిలయంగా మారుతున్నాయి. చెత్తకుప్పలు పేరుకుపోయిన చోట కుక్కలు నివాసం ఉంటూ చెత్తను తవ్వుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో ఆ దారిన వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్తను రోడ్ల వెంబడి వేయకుండా చూడటంలోనూ, పేరుకుపోయిన చెత్తను సకాలంలో తొలగించడంలోనూ శానిటేషన్ సిబ్బంది విఫలమవుతున్నారని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శానిటేషన్ అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

మలక్‌పేటలో మహిళ అదృశ్యం

మలక్‌పేట: ఆసుపత్రిలో రోగికి హెల్పర్‌గా ఉన్న ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... వనపర్తి జిల్లా రాజాపేట గ్రామానికి చెందిన అంజనమ్మ(36) కూలీ. అదే జిల్లా గోపాల్‌పేటకు చెందిన ఆటోడ్రైవర్ వల్లెపు వీరబాబు భార్య సువర్ణను ఈ నెల 10 తేదీన మలక్‌పేటలోని కృతిక ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో సువర్ణకు హెల్పర్‌గా అంజనమ్మను పెట్టారు. అంజనమ్మ సమాచారం ఇవ్వకుండా ఈ నెల 15 తేదీన ఉదయం 11 గంటలను ఆసుపత్రి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా, బంధువులను విచారించినా ప్రయోజనం లేకుండాపోయింది. వీరబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెల్టుషాపులపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

ఐదుగురి అరెస్టు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం వివిధ ప్రాంతాల్లో సరూర్‌నగర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సరూర్‌నగర్ పరిధిలో గల నందనవనం, బాలాపూర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, అల్మాస్‌గూడ, జిల్లెలగూడ, లెనిన్ నగర్‌లో బెల్టు షాపులపై దాడులు జరిపారు. ఈ సంఘటనలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. దాడుల్లో 16.9 లీటర్ల బీరు, 21.52 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తను రోడ్లపై వేస్తే చర్యలు



డప్పు వాయిస్తూ అవగాహన కలిపిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: చెత్తను రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, చెత్తను జీహెచ్‌ఎంసీ సూచించిన ప్రాంతాల్లోనే వేయాలని హయత్‌నగర్ సర్కిల్ శానిటేషన్ డీఈ నీలిమ తెలిపారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం శానిటేషన్ సిబ్బంది, అధికారులతో కలిసి డప్పు కొడుతూ చెత్తపై అవగాహన కల్పించారు. నీలిమ మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయని, దుర్వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని తెలిపారు. దుకాణదారులకు, ఇంటి యజమానులు చెత్తను రోడ్లపై వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

'ఇందిరమ్మ' సర్వే పూర్తి



సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

వార్డు సభల ద్వారా అర్హుల జాబితా వెల్లడి

- దివ్యాంగులు, వితంతువులకు తొలి ప్రాధాన్యత: అధికారులు

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించిన సర్వేను మీర్‌పేట మున్సిపాలిటీలో అధికార యంత్రాంగం పూర్తి చేసింది. కొద్ది రోజులుగా పురపరిధిలో కొనసాగుతున్న సర్వేలో.. దరఖాస్తు చేసుకున్న 10,300 మంది ఇంటింటికి వెళ్లి, అధికారులు వివరాలు సేకరించారు. అర్హుల వివరాలను సంబంధిత యాప్‌లో పొందు పరిచారు. ఈ పథకానికి.. సొంత స్థలం ఉండి, పెంకులు, రేకుల ఇళ్లు, శిథిలావస్థకు చేరుకున్న వాటికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇవ్వనుందని అధికారులు తెలిపారు. అర్హుల తుది జాబితాను సోమ, మంగళవారాల్లో వెల్లడించనున్నట్లు చెప్పారు.

వార్డు సభల ద్వారా జాబితా

ఈ నెల 21, 22, 23 తేదీల్లో కార్పొరేషన్‌లోని 46 డివిజన్లలో వార్డు సభల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులోనే ఇళ్ల అర్హుల పేర్లను చదివి వినిపించనున్నారు. దీంతో పాటు సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్‌కార్డులు లేవని తెలిపిన కుటుంబాలు 1,352గా ఉన్నట్లు గుర్తించిన అధికారులు.. ఈ లిస్టును పున పరిశీలించి ప్రభుత్వానికి పంపించనున్నారు. అనంతరం వచ్చే తుది జాబితాలోని అర్హులైన పేర్లను వార్డు సభల్లో వెల్లడిస్తారు.

పారదర్శకంగా..



ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాం. వార్డు సభలు ఏర్పాటు చేసి, అర్హుల పేర్లను చదివి వినిపిస్తాం. దరఖాస్తు చేసుకున్న వారందరూ అర్హులే.. ఇందులో నిరుపేదలు, దివ్యాంగులు, వితంతువులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.

– ఆర్.జ్ఞానేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

భూ బాధితులకు అండగా ఉంటాం

- రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



అగర్‌మియాగూడలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కందుకూరు: ఫ్యూచర్ సిటీలో భూములు కోల్పోతున్న రైతులకు అండగా ఉంటామని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య అన్నారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని చెప్పారు. శుక్రవారం పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఫ్యూచర్ సిటీ రహదారిలో భూములు కోల్పోతున్న తిమ్మాపూర్, అగర్‌మియాగూడ, లేమూరు గ్రామాల్లో పర్యటించి, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్‌లో ఎకరా భూమి ధర రూ.4 నుంచి రూ.6 కోట్లు పలుకుతుందని, ప్రభుత్వం మాత్రం కేవలం రూ.60 నుంచి రూ.70 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకొందామని చూస్తుందని విమర్శించారు. ఎలాంటి నోటీసులు లేకుండా గ్రామసభలు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు మధ్య భూ సర్వేలు చేపట్టడం తగదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అవసరమైతే బాధితులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, అంజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుమార్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గణేశ్, పార్టీ మహేశ్వరం మండల కార్యదర్శి శేఖర్, ఆమనగల్లు కార్యదర్శి శివశంకర్, శ్రామిక మహిళా విభాగం జిల్లా కార్యదర్శి కవిత, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సమస్యల పరిష్కారానికి కృషి

మేయర్ పారిజాత



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మేయర్ పారిజాత అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధి 16వ డివిజన్ బాలాపూర్ గ్రామం 15వ డివిజన్‌లోని సీపీఎస్‌ఆర్‌కాలనీ, గ్రీన్‌సిటీ, సీతాహోమ్స్, 24వ డివిజన్ జయశంకర్ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణ పనులతో పాటు అల్మాస్‌గూడ 26వ డివిజన్ శ్రీశ్రీహోమ్స్ కాలనీలో ఓపెన్ జిమ్‌ను స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం 31వ డివిజన్ బాలాజీనగర్ కాలనీలో రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాంరెడ్డి, రామిడి కవిత, ఎర్ర జైహింద్, శశిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కోతులు

శివారు గ్రామాల్లో వానరాల బెడద



అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఓ ఇంటి వద్ద కోతులు

అబ్దుల్లాపూర్‌మెట్: కోతుల చేష్టలు చూడటానికి బాగానే ఉన్నా.. వాటి ఆగడాలను భరించలేక నగర శివారు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంపులుగా సంచరిస్తూ.. ఇళ్లలోకి చొరబడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రోడ్లపై వెళ్తున్న వాహనదారులు, బాటసారులతో పాటు.. ఇంటి పరిసరాల్లో ఉన్న పిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడులకు పాల్పడుతూ హడలెత్తిస్తున్నాయి. కొంత కాలంగా వానరులతో ఇబ్బంది పడుతున్నప్పటికీ.. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని బాధిత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం కోతుల చేష్టలతో ఇక్కట్లు పడుతున్నామని మండల పరిధి అబ్దుల్లాపూర్, లష్కర్‌గూడ, కవాడిపల్లి వాసులు వాపోతున్నారు. ఇంట్లో ఉండాలన్నా.. వెలుపలకి రావాలన్నా భయంగా ఉందని, కోతుల బెడద నుంచి తప్పించాలని కోరుతున్నారు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు



మోడల్‌హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- రాజకీయాలకు అతీతంగా మంజూరు
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: పేదలకే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ నిర్మాణాన్ని 45 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మట్లాడుతూ.. ఒక్కో నియోజకవర్గంలో ఏడాదికి 3500 ఇళ్లను నిర్మించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నియోజకవర్గంలో వచ్చే నాలుగేళ్లలో 20 వేల ఇళ్లను నిర్మించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నామని, అందుకు అవసరమైన సహకారం ప్రభుత్వం నుంచి తీసుకుంటామని పేర్కొన్నారు. తొలుత ఇళ్లులేని సఫాయి కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్లు దక్కుతాయని, పైరవీలకు తావులేదని స్పష్టంచేశారు.

అప్పుల్లో ముంచిన బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిచ్చి ఇస్తామని చెప్పి, పదేళ్ల పరిపాలించి పేదోడి సొంతింటి కల నెరవేర్చలేదని ఎమ్మెల్యే విమర్శించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని ఆరోపించారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్లు కప్పరి స్రవంతి, మర్రి నిరంజన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, ఎంపీడీఓ వెంకటమ్మ, గృహనిర్మాణ శాఖ అధికారులు చంప్లానాయక్, సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు రవీంద్ర సాగర్, అమరేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

దరఖాస్తులు వేలల్లో.. అర్హులు వందల్లో..

- మున్సిపాలిటీలో రేషన్ కార్డులకు అర్హులు 815
- భారీగా వడపోతల ప్రక్రియ
- ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో అర్హుల ఎంపిక

శంషాబాద్: ప్రజాపాలనలో రేషన్ కార్డు కోసం వేలల్లో దరఖాస్తుల వచ్చినా ప్రస్తుతానికి వందల్లో మాత్రమే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. శంషాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 815 మంది దరఖాస్తుదారులకు మాత్రమే రేషన్ కార్డుల అందించేందుకు అర్హులుగా నిర్ణయించి సబంధిత జాబితా ఆధారంగా తాజాగా క్షేత్ర స్థాయి ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన వారి ఆర్థిక, ఉద్యోగ, ఆస్తులకు సంబంధించిన ఆధారాలతో పెద్ద ఎత్తున వడపోతను చేపట్టారు. ప్రస్తుతానికి మాత్రం వేయి లోపు మాత్రమే జాబితా విడుదల కాగా వారి ఫోన్, ఆధార్ తదితర నంబర్ల ద్వారా వారివారి ఇళ్ల వద్దకు చేరుకుని పరిశీలన చేపడుతున్నారు. ఈ నెల 26 నుంచి సంబంధిత అర్హులకు కొత్త రేషన్ కార్డులు అందనున్నాయి.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌ల్లో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.11, వంకాయ రూ.28, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.40, దొండ రూ.50, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.32, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.45, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్ రూ.33, కీర రూ.35, బీన్స్ రూ.47, క్యాప్సికమ్ రూ.47. శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

వాహనాల తనిఖీ

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు శుక్రవారం పీఎస్ పరిధి నక్కర్త మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాల్లో వాహనాలను తనిఖీలు చేశారు. సీఐ లిక్కి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ తేజంరెడ్డి, సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

లేమామిడిలో ఉచిత వైద్య శిబిరం

కేశంపేట: మండల పరిధిలోని లేమామిడిలో నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరం విజయవంతమైంది. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 42 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌ఓ పాషా, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఓంకారం, అంజయ్య, మన్మథరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన టోర్నమెంట్

ఆమనగల్లు: మండల పరిధి మాలెపల్లి గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వివిధ క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా విజేతలకు ఎస్ఐ వెంకటేశ్,కేంద్ర సాహిత్య పురస్కార అవార్డు గ్రహీత, రచయిత తగుల్ల గోపాల్‌లు బహుమతులు అందజేశారు. ఇదిలా ఉండగా.. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన లక్ష్మణ్, లింగమయ్య, మౌనికలను ఎస్ఐ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాములు, రవికుమార్, మైసయ్య, పరశురాంరెడ్డి, విక్రంరెడ్డి, రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీసీ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

చేవెళ్ల/మొయినాబాద్: చేవెళ్ల మండల పరిధిలోని దేవునిఎర్రవల్లిలో స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో మహిపాల్‌రెడ్డి టీం మొదటి స్థానంలో, రవీందర్ టీం రెండో స్థానంలో, రాజేశ్వర్‌రెడ్డి టీం మూడో స్థానంలో నిలిచాయి. రాజేశ్వర్‌రెడ్డి టీం తమకు వచ్చిన ప్రైస్ మనీని స్కూల్‌లో డస్ట్‌బిన్ల ఏర్పాటుకోసం అందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు రాజిరెడ్డి, శ్రీనివాస్, రాంరెడ్డి, మల్లారెడ్డి, రాఘవరెడ్డి, రవీందర్, రామకృష్ణ, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

మర్పల్లి: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శాపూర్ జీపీలో రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను తుమ్మల సురేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, నర్సాపూర్ తండా మాజీ సర్పంచ్ ధరమ్‌సింగ్ ఉన్నారు.

ఎన్జీవోస్ కాలనీలో మోడల్ లైబ్రరీ నిర్మిస్తాం

గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో హౌసింగ్ సొసైటీ ఇచ్చిన 400 గజాల స్థలంలో త్వరలో మోడల్ లైబ్రరీని నిర్మించి దానిని డిజిటల్ లైబ్రరీగా అభివృద్ధి చేస్తామని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎన్జీవోస్ కాలనీలోని రేకులషెడ్డులో నడుస్తున్న గ్రంథాలయాన్ని, ఆదే ప్రాంగణంలో గ్రంథాలయం కోసం కాలనీ హౌసింగ్ సొసైటీ ఇచ్చిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ రేకులషెడ్డు శిథిలం కావడంతో వర్షాకాలం తడిచి విలువైన పుస్తకాలు పాడవుతున్నాయని, కనీస వసతులు లేక సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయం నిర్మాణానికి రూ.1.90 కోట్లు మంజూరయ్యాయని, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రితో మాట్లాడి త్వరలోనే భవన నిర్మాణం చేపడతామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పద్మ, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సోమయాజులు, ఓంప్రకాష్, సీహెచ్‌వీ ఆర్‌కే మూర్తి, జైపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరప్ప, నవీద్, హరి తదితరులు పాల్గొన్నారు.

విజృంభణ.. విలవిల

- కాలనీల్లో దోమలతో పెరుగుతున్న విషజ్వరాలు
- వ్యాధుల బారిన పడుతున్న కాలనీల ప్రజలు

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయి. మూసీనదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల ప్రజలు విలవిలలాడుతున్నారు. దోమలు కుట్టడం ద్వారా డెంగీ, మలేరియా, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'డెంగీ, మలేరియాను నివారిద్దాం.. మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం'అంటూ ఇప్పుడు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓల్డ్ మలక్‌పేట్, ముసారాంబాగ్, తీగలగూడ, ఎన్‌టీఆర్ నగర్, సింగరేణి కాలనీ, అంబేడ్కర్‌నగర్ కాలనీల్లో రాత్రిపగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. కలుషిత జలాలతో నిండిన చెరువులు, విరివిగా పెరిగే చెట్ల చుట్టుపక్కల ప్రాంతాలు, మురికివాడలు దోమల ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో దోమకాటు బాధితులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి: విజయ్ కుమార్, ఆర్‌కే పురం

ఈ సీజన్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ముందుచూపుతో వ్యవహరించి ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి. కాలనీలు, బస్తీల్లో విరివిగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలి. డ్రైనేజీ లీకేజీలు, చెత్తాచెదారం లేకుండా శానిటేషన్ విభాగం అధికారులు కృషి చేయాలి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: డాక్టర్ అర్చన

వర్షాకాలంలో ప్రజలు కనీస జాగ్రత్తలు పాటిస్తే రోగాల బారి నంచి కాపాడుకోవచ్చు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతోపాటు నీటిలో తేమ శాతం పెరిగిపోతుంది. దీంతో గొంతు బొంగురు పోవడం, చలి, జ్వరం, డెంగీ, మలేరియా, కీళ్ల నొప్పులు వస్తాయి. వర్షా కాలంలో ఇంటి చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, కాచి వడపోసిన నీటిని తీసుకుంటే మంచిది. జ్వరం రెండు రోజులకు మించి ఉంటే వైద్యులను సంప్రదించాలి.

ఓటీఎస్‌ను వినియోగించుకోండి

సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్ గుప్తా తదితరులు

ఆమనగల్లు: డీసీసీబీ బ్యాంకులు, పీఏసీఎస్‌ల ద్వారా దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు ఏకకాల రుణ పరిష్కార పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా సూచించారు. పట్టణంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శుక్రవారం డీసీసీబీ ఆమనగల్లు శాఖ మేనేజర్ గోపాల్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ ఏకగ్రీవ తీర్మానం మేరకు ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పరిధి పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు పొందిన మొండి బకాయిదారులు 'వన్‌టైమ్ సెటిల్‌మెంటు' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి 2018 మార్చి 31 నాటికి రుణం తీసుకున్న వారు అర్హులను పేర్కొన్నారు. ఈ స్కీం దీర్ఘకాలిక రుణఖాతాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టంచేశారు. ఫిబ్రవరి 15 లోపు ఈ పథకం ద్వారా రుణాలు చెల్లించి, కొత్తగా రుణాలు పొందాలని సూచించారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డీసీసీబీ సూపర్‌వైజర్ రాజు, సీఈఓ దేవేందర్, సిబ్బంది, అల్లాజీ, పద్మాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మంచాల: క్రీడలపై యువత ఆసక్తి పెంచుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య అన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములు సమానమని, నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది కావాలని సూచించారు. మండల పరిధి ఆరుట్ల గ్రామంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేత జట్లకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీలో 32 జట్లు పాల్గొనగా, ప్రథమ స్థానంలో శ్రీరామ్ జట్టు, ద్వితీయంగా చండీశ్వర్ యూత్‌లు నిలిచాయి. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుగ్గరాములు, యూసుఫ్ అలీ, బుచ్చయ్య, గోపాల్, రవి, బీరప్ప, అంజయ్య, అశోక్, గణేశ్, శ్రావణ్, ఐలయ్య, జంగయ్య పాల్గొన్నారు.